# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 06-04-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్ జిల్లాల ఎన్నికల అధికారులను ఆదేశించారు.

**2.** **ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులు, విజ్ఞప్తులను ఎన్నికల సంఘానికి నేరుగా అందించవచ్చని ఆంధ్రప్రదేశ్ ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా వెల్లడించారు.**

**3.** **ఆంధ్రప్రదేశ్‌లో సామాజిక భద్రతా ఫించన్ల పంపిణీ ప్రక్రియ 94 శాతం పూర్తయిందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశి భూషణ్ కుమార్ తెలిపారు.**

**4.** **వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్సుయాత్ర ఈరోజు శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో కొనసాగుతుంది.**

**5.** **తెలంగాణాలో లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఈరోజు తుక్కుగూడలో జన జాతర బహిరంగ సభ నిర్వహించనుంది.**

==========================

2024 లోక్సభ ఎన్నికల్లో ఓటర్ల సంఖ్య, పోలింగ్ శాతం పెంచేలా బూత్ స్థాయిలో ఓటింగ్ పై అవగాహనా కల్పించేందుకు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్ పలు జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు.మున్సిపల్ కమిషనర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో ఢిల్లీలో నిన్న 'Low ఓటర్ టర్న్ అవుట్' అనే అంశం పై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తెలంగాణ సహా ఏడు రాష్ట్రాల ఎన్నికల ప్రధాన అధికారులు, హైదరాబాద్ సహా పది నగర పాలక సంస్థలకు చెందిన మున్సిపల్ కమిషనర్లు ఈ సదస్సుకి హాజరయ్యారు.ఈ సందర్భంగా రాజీవ్ కుమార్ మాట్లాడుతూ 215 గ్రామీణ, యాభై ఒక్క పట్టణ పార్లమెంటరీ నియోజకవర్గం వర్గాల్లో ఓటింగ్ శాతం తక్కువ ఉన్నట్లు గుర్తించి అక్కడ ఓటింగ్ శాతం పెంచేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు వేరువేరు వ్యూహాలను రూపొందించాలని, ఓటర్ల ప్రకారం ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎన్నికల్లో పాల్గొనే ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునే వాతావరణం సృష్టించాలని సూచించారు.

--------------------------

ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులు, విజ్ఞాపనలను ఎన్నికల సంఘానికి నేరుగా అందించవచ్చని ఆంధ్రప్రదేశ్ ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా ప్రకటించారు. వెలగపూడి సచివాలయంలో నిన్న

ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. సచివాలయంలోని ఎన్నికల సంఘం కార్యాలయంలో ప్రతిరోజూ సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య ఫిర్యాదులు, వినతులు స్వీకరిస్తామని, సెలవు రోజుల్లోనూ కార్యాయలం అందుబాటులో ఉంటుందని తెలిపారు.రాజకీయ పార్టీలు, సంఘాలు, ఎవరైనా ఎన్నికలకు సంబంధించిన విషయాలపై ఫిర్యాదులు నేరుగా అందచేయాలని తెలిపారు. రాష్ట్రంలో ఎన్నికల నియమావళి అమలు చేసినప్పటి నుంచి ఇప్పటివరకు 47.5 కోట్ల రూపాయల విలువైన నగదు, మద్యం, వెండి, బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో సామాజిక భద్రతా ఫించన్ల పంపిణీ ప్రక్రియ 94 శాతం పూర్తయిందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశి భూషణ్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. నిన్న సాయంత్రానికి 94 శాతం మంది ఫించన్ దారులకు 1847 కోట్ల 52 లక్షల రూపాయలను పించన్లుగా అందించడం జరిగిందని శశి భూషణ్ కుమార్ పేర్కొన్నారు. చిత్తూరు, ఏలూరు, విశాఖ జిల్లాలు 95 శాతం పింఛన్ల పంపిణీ చేశాయని, గిరిజన ప్రాంతాలైన పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోనూ 94 శాతం మేర అందజేసినట్లు తెలిపారు.నూరు శాతం ఫించన్లు పంపిణీ ప్రక్రియను పూర్తి చేసేలా మిగతా ఫించన్ దారులకు నగదు పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు.

---------------------------

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్సుయాత్ర ఈరోజు నెల్లూరు జిల్లా నుంచి కొనసాగుతుంది. చింతరెడ్డి పాలెం దగ్గర నుంచి ఈ ఉదయం ఆయన బయలుదేరి.. కొవ్వూరు క్రాస్, సున్నబట్టి, తిప్ప, గౌరవరం చేరుకుంటారు. అనంతరం కావలిలో జరిగే బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు. సభ అనంతరం ఏలూరుపాడు, ఉలవపాడు క్రాస్, సింగరాయకొండ క్రాస్, ఓగురు, కందుకూరు, పొన్నలూరు, వెంకుపాలెం మీదుగా జువ్విగుంట వద్ద రాత్రి బస చేస్తారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలశిల రఘురాం తెలిపారు.

---------------------------

కృష్ణా జలాల పంపిణీ, వినియోగంలో పారదర్శకత, కచ్చితత్వం కోసం 9 ప్రాంతాల్లో టెలీమెట్రీ కేంద్రాల ఏర్పాటుకు నిధులు విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలను కృష్ణా నది యాజమాన్య బోర్డు కోరింది. ఈ మేరకు బోర్డు సభ్యుడు ఆర్.ఎన్. శంఖ్వా ఆంధ్రప్రదేశ్ జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, తెలంగాణ నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శులకు లేఖలు రాశారు. శ్రీశైలం కుడి కాలువ పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ దిగువన, కేసీ కెనాల్, సాగర్ ఎడమ కాలువ, కుడి కాలువ, ప్రకాశం బ్యారేజీ తూర్పు ప్రధాన కాలువ, పశ్చిమ ప్రధాన కాలువ, పోలవరం కుడి కాలువ, పాలేరు ఎగువన, ఇరు రాష్ట్రాల సరిహద్దుల్లో సాగర్ ఎడమగట్టు ప్రధాన బ్రాంచి కాలువల వద్ద అధునాతన టెలీమెట్రీలు ఏర్పాటు చేయవలసి ఉందని తెలిపింది, నీటి నిర్వహణ, పంపిణీ సజావుగా సాగేందుకు వీలుగా రెండు రాష్ట్రాలు వీలైనంత త్వరగా నిధులను విడుదల చేయాలని లేఖలో బోర్డు కోరింది.

---------------------------

తెలంగాణాలో లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగాకాంగ్రెస్ పార్టీ హైదరాబాదు సమీపంలోని తుక్కుగూడలో జన జాతర బహిరంగ సభ ఈ రోజు నిర్వహించనుంది. అఖిల భారత కాంగ్రెసు కమిటీ అధ్యక్షులు

మల్లిఖార్జున్ ఖర్గే, పార్టీ సీనియర్ నాయకులు రాహుల్ గాంధీ తదితరులు ఈ సభలో పాల్గొంటారని ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి. మరోవైపు తుక్కుగూడ బహిరంగ సభ నేపథ్యంలో.. సభకు హాజరయ్యే వాహనదారులకు, సాధారణ వాహనదారులకు రాచకొండ సీపీ తరుణ్‌జోషి పలు సూచనలు చేశారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి 9గంటల వరకు వాహనదారులు నిబంధనలు పాటించాలన్నారు. తుక్కుగూడ ఔటర్ రింగ్ రోడ్డు వద్ద సాధారణ వాహనాలను కిందకు దిగడానికి అనుమతించరని తెలిపారు. పెద్దఅంబర్‌పేట నుంచి పెద్దగోల్కొండ దారిలో సాయంత్రం 4నుంచి రాత్రి 9గంటల వరకు సాధారణ వాహనాలకు అనుమతి లేదని ఆయన తెలిపారు.

---------------------------

తెలంగాణలో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని భారత రాష్ట్ర సమితి అధినేత కె.చంద్రశేఖర రావు కోరారు. కరీంనగర్ పర్యటనలో భాగంగా సిరిసిల్ల పార్టీ కార్యాలయంలో ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ రాష్ట్రంలో 15 నుంచి 20 లక్షల ఎకరాల్లో ఎండల తీవ్రత కారణంగా పంటలు ఎండిపోయాయని అన్నారు. చనిపోయిన రైతు కుటుంబాలకు ప్రభుత్వం 25 లక్షల పరిహారం ఇవ్వాలని ఎకరానికి 25వేలు చొప్పున పరిహారం చెల్లించాలని కోరారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాల కోసమే టీడీపీ, భారతీయ జనతా పార్టీ, జనసేన పార్టీలు కూటమిగా పోటీ చేస్తున్నాయని తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలో నిన్న నిర్వహించిన ప్రజాగళం సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని అగ్రగామిగా మార్చేందుకు అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామని పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్ఆర్ జిల్లా కాశినాయన మండలం అమగంపల్లిలో బస్సు యాత్రను ఆమె నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ రుణమాఫీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, జలయజ్ఞం, ఆరోగ్యశ్రీ వంటి కార్యక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అమలు చేశారని చెప్పారు.

---------------------------

అనారోగ్యం కారణంగా వారాహి విజయభేరి సభలకు విరామం ప్రకటించిన జనసేన అధినేత కె. పవన్ కల్యాణ్ రేపటి నుంచి ఎన్నికల ప్రచార యాత్రను కొనసాగిస్తారని ఆ పార్టీ కార్యదర్శి ఓ ప్రకటనలో వెల్లడించారు. వారాహి యాత్రలో భాగంగా రేపు అనకాపల్లిలో, 8వ తేదీన ఎలమంచిలి నియోజకవర్గంలో నిర్వహించే సభలో పాల్గొంటారని పేర్కొన్నారు. 9న పవన్ కల్యాణ్ పోటీ చేస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో ఉగాది వేడుకల్లో పాల్గొంటారని తెలిపారు. నెల్లిమర్ల, విశాఖ దక్షిణ, పెందుర్తి నియోజకవర్గాల్లో పర్యటనకు సంబంధించిన వివరాలను త్వరలో వెల్లడిస్తామని పార్టీ కార్యదర్శి తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లా శ్రీశైలక్షేత్రంలో ఈ రోజు నుంచి ఉగాది ఉత్సవాలు ప్రారంభమైయ్యాయి. ఈ నెల 10వ తేదీ వరకు ఐదురోజులపాటు ఉగాది మహోత్సవాలను నిర్వహించనున్నట్లు కార్యనిర్వాహణ అధికారి వెల్లడించారు.

=====================